# ప్రపంచంలో మెరిసిన భారత నగరాలు

## వరల్డ్ టాప్ 100లో.. హైదరాబాద్, బెంగుళూరు, ముంబై



**మహా ప్రత్యేకం:** ప్రపంచ పటంలో నగరాల ప్రతిష్టను, జీవన ప్రమాణాలను, ఆర్థిక దూకుడును కొలిచే తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్ విడుదలయ్యాయి. అందులో భారత నగరాలు తమ ప్రత్యేక ముద్ర వేసుకుంటూ శక్తివంతమైన ఎదుగుదలతో ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. టెక్నాలజీ నుంచి సాంస్కృతిక వైభవం వరకు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి ఆర్థిక అవకాశాల వరకూ ప్రతి రంగంలో భారత పట్టణాలు తమ అద్భుత సామర్థ్యాన్ని చాటుతున్నాయి. అందరిలోనూ బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలు ప్రపంచంలోని టాప్ 100 బెస్ట్ సిటీస్ జాబితాలో చోటు దక్కించుకోవడం దేశానికి గర్వకారణంగా నిలిచింది. ఒకవైపు ఆర్థిక శక్తి, మరోవైపు జీవన నాణ్యత ఈ ద్వంద్వ బలం భారత నగరాలను అంతర్జాతీయ వేదికపై కొత్త ఎత్తులకు తీసుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా 270+ నగరాలను పరిశీలించి రెజొనెన్స్ కన్సల్టెన్సీ, ఇపోసిస్ కలిసి వరల్డ్ బెస్ట్ సిటీస్ -2026కు టాప్ 100 నగరాలు ఎంపికచేశారు.

## ప్రపంచంలోని టాప్ 10 బెస్ట్ నగరాలు

### 1. లండన్ - అజేయ మహానగరం

అభిజాత్య సంస్కృతి, ఆర్థిక దూకుడు, విద్యా ప్రస్థానం... శతాబ్దాల చరిత్రను భుజాన వేసుకుని లండన్ మరోసారి ప్రపంచ నంబర్ వన్ నగరంగా నిలిచింది. ఇది సిటీస్ కు చక్రవర్తి లాంటిది.

### 2. న్యూయార్క్ - ప్రపంచ ధైర్యానికి చిరునామా

"సిటీ దట్ నెవర్ స్లీప్స్" అనే పేరు ఎందుకంటే... వాణిజ్యం, ఆవిష్కరణ, స్వేచ్ఛ... ప్రపంచం నిండా కలలతో వచ్చిన వారికి ఈ నగరమే మొదటి అడుగు.

### 3. ప్యారిస్ - కళలకు రాచబాట

ప్రేమను, ఫ్యాషన్‌ను, కళను ఒకే చెయ్యిలో పట్టుకున్న నగరం. ఈఫిల్ టవర్ నీడలో ఊపిరిపీల్చితేనే ప్రపంచం అందంగా కనిపిస్తుంది. సాంస్కృతిక సోయగానికి ప్రతీక.

### 4. టోక్యో - భవిష్యత్తు నగరం

వేగం, క్రమశిక్షణ, సాంకేతిక ప్రతిభ... టోక్యో సొంతం. గతాన్ని గౌరవిస్తూ, భవిష్యత్తు వైపు పరుగెత్తే నాగరికత.

### 5. మాడ్రిడ్ - జీవలహరి నగరం

ప్రాణం ఉన్న వీధులు, కళతో నిండిన గ్యాలరీలు, జీవితం పండించే ఉత్సాహం. సంగీతం, నృత్యం, నిగర్విని పట్టుకుపోయే యూరోప్ హృదయం.

### 6. సింగపూర్ - శుభ్రతకు రాజధాని

చిన్నదైనా చిత్తశుద్ధి పెద్దది. పరిపాలనలో ప్రామాణికత, జీవన ప్రమాణాల్లో అగ్రగామిత్వం. ఆధునిక ప్రపంచానికి ఒక పరిపూర్ణ నమూనా.

## ప్రపంచ టాప్ -100లో మెరిసిన ఐదు భారత నగరాలు

### ఢిల్లీ – ర్యాంక్ 54

ఆధునిక భారత దిశా నిర్దేశం, దేశ పాలనాకేంద్రం ఢిల్లీ. ప్రపంచంలో అత్యంత జీవనశక్తి గల రాజధానుల్లో ఒకటి. పాలన, పురపాలన, పురోగతి—అన్నింటినీ సమతూకంగా నడిపించే నగరం.

### ముంబై – ర్యాంక్ 40

సంపదకు నాడి, అవకాశాలకు నిలయం, కలలకు కేంద్రము. ఇది ముంబై కాదు.. భారత ఆర్థిక హృదయం. సముద్ర గాలి లాగా ఈ నగరం ప్రతి రోజూ కొత్త శక్తి పుట్టిస్తోంది.

### హైదరాబాద్ - ర్యాంక్ 82

చారిత్రక వైభవం, టెక్నాలజీ శక్తి.. చార్మినార్ నుంచి సైబర్‌టవర్ల వరకు ఈ నగరం తన పరిణామాన్ని ప్రపంచానికి నిరూపిస్తోంది. "భవిష్యత్ భారత నగరాల మోడల్" అంటే హైదరాబాదే దిక్సూచి

### బెంగళూరు – ర్యాంక్ 29

బెంగుళూరుకు భారత సిలికాన్ వ్యాలీ"గా పేరుంది. టెక్నాలజీ, ఉద్యమశక్తి, గ్రీన్ లైఫ్. ప్రపంచ నగరాల్లో టాప్ 30లో చోటు దక్కించుకున్న ఏకైక భారత నగరం.ఇది అభివృద్ధి శబ్దం కాదు. భారత యువత కలల గర్జన.

### చెన్నై – ర్యాంక్ 90

దక్షిణ భారత సంస్కృతి, ఐటి శక్తి, విద్య విలువలకు చెన్నై నగరం కేంద్రం. అద్భుతమైన సమతుల్యత చూపిన నగరం. మౌనంగా పనిచేసి, ఘనంగా మెరిసిన మణి ఈ చెన్నై నగరం.

### 7. రోమ్ - చరిత్ర ముద్దాడిన నగరం

కాలోజియం గోడలు చెబుతున్నాయి. శతాబ్దాల క్రితం రాసిన సామ్రాజ్య కథలు ఇంకా ఇక్కడే జీవిస్తున్నాయని. ప్రాచీనతకు ప్రతిరూపం.

### 8. దుబాయ్ - కలలకి చిరునామా

ఎడారి ఇసుకలపై నిర్మించిన అద్భుత సామ్రాజ్యం. భవిష్యత్ నగర నిర్మాణం ఎలా ఉండాలో ప్రపంచానికి నేర్పిన శిల్పం.సంపద, శోభ, సౌభాగ్యాల హబ్.

### 9. బెర్లిన్ -

ఐక్యతను తనలో దాచుకున్న నగరం. విభజన గాయాల నుంచి లేచి ప్రపంచానికి శాంతి సందేశం చెప్పిన నగరం. కళ, సంస్కృతి, రాజకీయ చైతన్యం

### 10. బార్సెలోనా -

వాస్తువైభవాల రంగుల కేన్వాస్ శిల్పాలు, వేసవి తీరం, యూరోపియన్ ఆనందం. జీవితం అందంగా ఉండాలి అంటే ఈ నగరం లాంటి స్ప్రిరిట్ కావాలి.

## ప్రపంచ పటంలో భారత్ ఎందుకు మెరిస్తోంది?

- టెక్నాలజీ మరియు పెట్టుబడుల్లో వేగవంతమైన పెరుగుదల
- మెట్రో రైళ్లు, రింగ్ రోడ్లు, స్మార్ట్ మౌలిక వసతులు
- గ్లోబల్ కంపెనీల ఆకర్షణకు కేంద్రాలు
- యువత నడిపిస్తున్న స్టార్టప్ విప్లవం
- చరిత్ర మరియు ఆధునికతను కలిపిన ప్రత్యేక నగర సంస్కృతి



